గణేష్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

విద్యుత్‌భారాలు తగ్గించాల్సిందే..

◆ వామపక్షాల డిమాండ్ ◆ గణేష్ సర్కిల్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విద్యుత్ ఛార్జీలను తగ్గించే వరకు పోరాడుతామని సిపిఎం, సిపిఐ, సిఐటియు, రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాడు గణేష్ సర్కిల్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌లు మాట్లాడుతూ ఎడాపెడా విద్యుత్ ఛార్జీలను పెంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్‌ఛార్జీలు, సర్దుబాట్లు తదితర పేర్లతో ఇప్పటికే రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం రూ.4500 కోట్లు భారం మోపిందని చెప్పారు. రాబోయే రోజుల్లో మరో రూ.500 కోట్లు భారం వేసేందుకు సిద్ధపడిందని వివరించారు. ఎన్నికలకు ముందు ఎటువంటి భారాలు వేయబోనని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారని గుర్తుచేశారు. ఆచరణలో మాత్రం భారాలపై భారాలు మోపుతూనే ఉన్నారన్నారు. మరోవైపు విద్యుత్ సంస్కరణలను చాపకింద నీరులా ప్రవేశపెడుతున్నారన్నారు. పంపిణీ వ్యవస్థలన్నింటినీ ప్రయివేటుకు అప్పగించేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఆదానీకి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ చర్యలను ఉపసంహరించుకుని ప్రజలపై భారాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీకి భయపడి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించి రైతులకు ఉరి తాళ్లు బిగించే కుట్రను జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీస్ పాలన సాగుతుందన్నారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల గొంతు నొక్కుతూ జగన్ తన సొంత రాజ్యాంగాన్ని నడుపుతున్నారని చెప్పారు. లక్షలాది మంది ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు చేయాలని చలో విజయవాడ కార్యక్రమం చేపడితే ఆ కార్యక్రమాన్ని పోలీసులు చేత పాసవికంగా అణిచివేశారన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏ నిరసన కార్యక్రమం చేపట్టినా దానిని పోలీసుల చేత అణచివేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు అన్నీ పెరిగాయన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర ధరలను తగ్గించకపోతే వైసిపి ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, రైతు సంఘం నాయకులు జెవి.రమణ, బడా సుబ్బిరెడ్డి, ఆంజనేయులు, శ్రీరాములు, వినోద్, వేమనారాయణ, పైపల్లి గంగాధర్, బ్యాల్లా అంజి, మహిళా సంఘం నాయకురాలు పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



'లెక్క' తప్పింది..!

◆ విద్యాశాఖ నిర్లక్ష్యం... విద్యార్థినికి శాపం..
◆ లెక్కల మాస్టర్ నిర్వాకంతో టెన్త్ ఫెయిల్
◆ న్యాయం కోసం విద్యార్థిని వేడుకోలు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థుల ఎదుగుదలలో పదవ తరగతి పరీక్షా ఫలితాలే చాలా ముఖ్యం. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పకడ్బందీగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల అనంతరం ఒక్కో జిల్లాకు ఒక సబ్జెక్టు పేపర్లను ప్రభుత్వం మూల్యాంకనం కోసం పంపుతారు. విద్యాశాఖ మూల్యాంకన సూత్రాలను ఇచ్చి ఆయా సబ్జెక్టుల్లో ప్రావీణ్యం ఉన్న వారిని మూల్యాంకనం కోసం నియమిస్తారు. ఆ సమయంలో విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన చేసి మూల్యాంకన చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు ఏ చిన్న పొరపాటు చేసినా విద్యార్థుల జీవితాలు బలి అవుతాయి. ఇలాంటి పొరబాటుకు హిందూపురం పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని బలైంది. లెక్కల మాస్టరు నిర్వాకం... విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థిని ఎస్.ఫర్‌హీన్ తీవ్రంగా నష్టపోయింది. గత మూడు నెలల నుంచి ఈ విద్యార్థిని తనకు న్యాయం చేయాలని విద్యాశాఖ అధికారులను కోరుతోంది.

పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో చదువున్న ఎస్.ఫర్‌హీన్ సైరబ్ 2022-2023 విద్యా సంవత్సరంతో పదవ తరగతి పరీక్షను రాసింది. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు వచ్చాయి. గణితంలో మాత్రం 26మార్కులు వచ్చాయి. విద్యార్థినికి లెక్కల్లో సైతం మంచి మార్కులు రావాల్సి ఉందని ఎస్ఎస్‌సి బోర్డుకు రూ.600 చెల్లించి రీ కౌంటింగ్‌కు ధరఖాస్తు

తాను పరీక్ష రాసిన పేపర్ నకలను చూపిస్తున్న విద్యార్థిని ఎస్. ఫర్‌హీన్ సైరబ్

చేసుకుంది. అందులో సైతం 26 మార్కులే వేశారు. దీంతో రూ.1000 చెల్లించి రీవేరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. విద్యార్థిని రాసిన జవాబు పేపర్లు బోర్డు నుంచి నకలు కాపీలను తీసుకుంది. వాటిని ఆ విద్యార్థినితో పాటు ప్రతిభావంతులైన లెక్కల మాస్టర్లకు చూపించింది. ఆ పేర్లను దిద్దగా అదనంగా 17 మార్కులు రావాల్సి ఉన్నట్లు తేలింది. పరీక్షా పేపర్ల మూల్యాంకన సమయంలో లెక్కల మాస్టరు నిర్లక్ష్యం చేశారని, కనీసం ప్రభుత్వం నిర్దేశించించన మూల్యాంకన ప్రధాన సూత్రాలను పాటించినా ఆ విద్యార్థిని కనీస మార్కులతో ఉత్తీర్ణత అయ్యి ఉండేదని కొంత మంది గణిత ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ సమస్యపై ఆ విద్యార్థిని గత మూడు నెలలుగా తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తు తల్లితో కలిసి విద్యాశాఖ అధికారుల చుట్టు తిరుగుతోంది. ఈ సమస్యను ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. చివరకు జిల్లా కలెక్టర్ న్యాయం చేస్తారని స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో ఆ విద్యార్థిని చదువుకు దూరమైయింది.

ఎవరూ పట్టించుకోవడం లేదు

తనకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తూ విద్యాశాఖ కార్యాలయాల చుట్టు మా అమ్మతో కలిసి మూడు నెలలుగా తిరుగుతున్నాను. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పదవ తరగతి పరీక్షల్లో అన్ని సబ్జక్టుల్లో మంచి మార్కులు వచ్చాయి. గణిత శాస్త్రంలో మాత్రం 26 మార్కులు వచ్చాయి. తాను రాసిన పరీక్ష పత్రాలను పరిశీలించిన గణిత ఉపాధ్యాయులు సెక్షన్-1లో రెండు, సెక్షన్-2లో రెండు, సెక్షన్-3లో 9, సెక్షన్-4లో నాలుగు మొత్తం 17 మార్కులు రావాల్సి ఉందని చెబుతున్నారు. ఈ జవాబు పత్రాలను పట్టుకుని జిల్లా కేంద్రం నుంచి పదవ తరగతి బోర్డు వరకు తిరుగుతున్నా తనకు ఎవరూ న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

ఎస్.ఫర్‌హీన్ సైరబ్,విద్యార్థిని .

విద్యార్థినికి న్యాయం చేయండి

మూల్యాంకన సమయంలో ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి గణిత శాస్త్ర ఉపాధ్యాయునిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన గణిత పేపర్లు ఏ జిల్లాలో మూల్యాంకనం చేశారో, మొత్తం పేపర్లను మరో సారి లెక్కల్లో ప్రావీణ్యం ఉన్న వారితో మరో సారి మూల్యాంకనం చేయించాలి. లేని పక్షంలో పదవ తరగతి బోర్డు కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

మండలస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం: కలెక్టర్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జామియా షాదీ మహల్‌లో మండల స్థాయి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ కె.కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్యతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే అర్జీల పరిష్కారానికి మండల స్థాయిలోనే పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం మండల పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు నరసింహులు, ఓబులమ్మ, గంగులమ్మ, రత్నమ్మలను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ డా॥కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా॥ఎంటి.నాయక్, డిసిఒ కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, తహశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాసులుతో పాటు జిల్లా, మండల స్థాయి పాల్గొన్నారు.

పంచాయతీ విభజనలో అన్యాయంపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - బుక్కపట్నం

పంచాయతీ విభజనలో బుక్కపట్నం గ్రామపంచాయతీ పూర్తిగా నష్టపోయిందని పంచాయతీ విభజన అసంతృప్తిగా జరిగిందని బుక్కపట్నం మేజర్ పంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ 2020 సంవత్సరంలో బుక్కపట్నం మేజర్ పంచాయతీ నుంచి బుచ్చయ్య గారి పల్లి, జానకంపల్లి, కడప నాగపల్లి గ్రామాలు కలిపి బుచ్చయ్య గారి పల్లి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారన్నారు. దీంతో పంచాయతీకి రావలసిన అన్ని వనరులు తగ్గిపోయాయని అన్నారు. అసంపూర్తి విభజన వల్ల పంచాయతీ అభివద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. మేజర్ పంచాయతీ జనాభా దాదాపు 8వేలుఉండగా 1141.29 ఎకరాలు, కేటాయించగా, బుచ్చయ్య గారి పల్లి పంచాయతీ గ్రామ జనాభా 4227 మంది ఉండగా 6650. 79 ఎకరాల భూమి కేటాయించారన్నారు. దీంతో ఆదాయంతో పాటు, విస్తీర్ణం కూడా పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. పంచాయతీ సరిహద్దు కూడా 10 అడుగుల దూరం ఉందని వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అభివృద్ధికి వనరులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా వార్డు సెక్రటరీలు, వాలంటీర్లు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి నాణ్యమైన సేవలను అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. బుధవారం మున్సిపల్ పరదిలోని 19వ వార్డు సచివాయాలన్ని ఆమె ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగారికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్, శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా మహిళా మార్ట్‌ను సద్వినియోగం చేసుకోండి : పురపాలక సంఘం లో త్వరలో ప్రారంభం చేయనున్న మెప్మా మహిళా మార్ట్‌ను మహిళలందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మెప్మా ఆర్‌పిలకు సూచించారు. బుధవారం పురపాలక సంఘ కార్యలయంలో మెప్మా ఆర్‌పిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతు పట్టణంలోని నంది సర్కిల్‌లో మెప్మా మహిళా మార్ట్‌ను ప్రారంభం చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లి ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో టిపిఆర్ఒ హరినాథ్ రెడ్డి, టిఎల్ఎఫ్ మల్లికా బాను, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

అందరికి ఇళ్లు ఉత్తిదేనా..?

◆ జగనన్న పేరుతో ఊర్లు ఎక్కడ.. ◆ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కర్నాటక సిపిఎం నాయకుల విమర్శ

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదలందరికీ ఇళ్లు, కాలనీలు కాదు ఊళ్లే నిర్మిస్తున్నామని గొప్పలు చెబుతున్నారు... ఆచరణలో ఇప్పటికీ పేదలు ఇళ్ల పట్టాల కోసం ఆందోళనలు చేయాల్సిన పరిస్థితులు క్షేత్ర స్థాయిలో కన్పిస్తుండడం విచాకరం అంటూ సిపిఎం కర్నాటక నాయకులు విమర్శించారు. చిలమత్తూరులో ఇళ్ల పట్టాల కోసం ఆందోళన చేస్తున్న పేదలను బుధవారం నాడు కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం కర్నాటక రాష్ట్ర నాయకులు ఓబులరాజు, అశ్వర్థనారాయణ, డిఐఎఫ్ఐ బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిజంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు వస్తున్నాయని తాము భావించామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ఇది వాస్తవం కాదని తేలిందన్నారు. చిలమత్తూరులో ప్రస్తుతం పేదలు ఇళ్ల పట్టాల కోసం మూడేళ్లుగా చేస్తున్న పోరాటం చూస్తుంటే జగన్మోహన్‌రెడ్డి మాటలన్నీ ఉత్తవే అని అర్థం అవుతోందన్నారు. భారత దేశంలో ఎక్కడైనా పోరాటం చేస్తేనే పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం మాని ఇళ్లులేక తిప్పలు పడుతున్న పేదలకు పట్టాలు ఇచ్చి, గృహ నిర్మాణాలు చేయించాలన్నారు. చిలమత్తూరులో రెవెన్యూ అదికారులు బాధ్యతగా తీసుకుని

పేదలతో మాట్లాడుతున్న బాగేపల్లి సిపిఎం నాయకులు

పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విలువైన స్థలం పేదలకు ఇవ్వకూడదన్న ఉద్దేశంతో పట్టాల పంపిణీని ఆపడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, పెనుకొండ రమేష్, సిపిఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, చంద్రశేఖర్, రమేష్, చందు, రహంతుల్లా, పేదలు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

ప్రజాశక్తి కదిరి అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికై సెప్టెంబరు 30వతేదీన ఎస్ఎఫ్ఐ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులందరు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి పథకాలలో ఎందుకు కోతలు విధించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు 3వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కదిరి పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు యశ్వంత్ పాల్గొన్నారు.

హిందూపురం : విద్యారంగ సమస్యలు పరిష్కారానికై సెప్టెంబరు 30వతేది ఎస్ఎఫ్ఐ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల మొద్దునిద్ర వహిస్తున్నాదన్నారు. అసెంబ్లీ జరిగిన ఐదు రోజుల్లో విద్యార్థుల సమస్యల గురించి ఊసెత్తలేదని వాపోయారు. నాలుగున్నరేళ్ళ కాలంలో ఇచ్చిన హామీలు మాటలకే తప్ప అమలుకు నోచుకోలేదని విమర్శించారు. చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి విద్యార్థుల సత్తా ఎంటో చూపిస్తామన్నారు.

అవినీతిపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-హిందూపురం

నీలకంఠపురం వాటర్ వర్స్‌లో గత రెండు సంవత్సరాల కాలంలో సుమారు రూ.650కోట్లు అవినీతి జరిగిందని, దీనిపై ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని శ్రీరామి రెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం హిందూపురం పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో నీలకంఠాపురం శ్రీ రామి రెడ్డి వాటర్ సప్లై స్కీమ్ ఆర్డబ్ల్యూఎస్ లో పనిచేస్తున్న కార్మికులు చౌడేశ్వరి కాలనీ దగ్గర ఉన్న పంచాయతీరాజ్ ఆఫీసు ఎదురుగా సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ లక్ష్మీనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతు ఏ డివిజన్‌లో జరగని అవినీతి మడకశిరా డివిజన్‌లో జరిగిందన్నారు. మడకశిర డివిజన్ గుత్తేదారుడు బినామి పేర్లతో, కార్మికులకు ఇచ్చే వేతనాల్లో కోత విధించి రూ.650కోట్ల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. వెంటనే గుత్తేదారుడిని బ్లాక్ లీస్టులో పెట్టి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. విచారణ పూర్తి అయ్యే వరకు గ్రామీణ నీటి పారుదల శాఖకు నిర్వహణ భాధ్యతను అప్పగించాలన్నారు. హిందూపురం డివిజన్‌లో పని చేస్తున్న కార్మికులకు గుత్తేదారుడు గోవింద రెడ్డి 18 నెలల పిఎఫ్ చెల్లించ లేదన్నారు. వెంటనే ఈ నిధులను పిఎఫ్ ఖాతాలోకి జమ చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అత్తర్ బాబా, కార్యదర్శి రామకృష్ణ, కల్లూరు ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రఫీక్, శ్రీరామి రెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేవెల్ సోమశేఖర్, జి మంజునాథ్, బాలు, యాల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ బిల్లు ఆమోదం దుర్మార్గం : యుటిఎఫ్

పెనుకొండలో జీవో ప్రతులు దగ్ధం చేస్తున్న నాయకులు

కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఏపీ అసెంబ్లీలో సెప్టెంబర్ 27న జిపిఎస్ బిల్లు ఆమోదం దుర్మార్గమని యుటిఎఫ్ నాయకులు అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం సిపిఎస్ విధానమును రద్దు చేసి పాత పెన్షన్ విధానమును ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌తో యుటిఎఫ్ 2004 నుంచి నేటి వరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక పోరాటాలు జరిపిందన్నారు. అయితే ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఏ ఉద్యోగి ఉపాధ్యాయుడు డిమాండ్ చేయకనే జిపిఎస్‌ను ప్రవేశపెట్టడాన్ని యూటీఎఫ్ సత్యసాయి జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. భవిష్యత్తులో అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పాత పెన్షన్ విధానం కొరకు ఉద్యమిస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు సీతామహాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మారుతి శ్రీనివాసులు జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి తాహిర్ వలి, హరికృష్ణ, రమీజా, శివశంకర్ తదితరులు జిపిఎస్ ఆమోదాన్ని ఖండించారు.

పెనుకొండ : శాసనసభలో జిపిఎస్ బిల్లు ఆమోదం తెలపడాన్ని పట్ల యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో బుధవారం శాసన సభలో ఆమోదించిన జిపిఎస్ జీవో ప్రతులను యుటిఎఫ్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జిపిఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. భవిష్యత్తులో అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పాత పెన్షన్ విధానం కొరకు యు టి ఎఫ్ ఉద్యమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు రమేష్, రవీంద్రనాథ్, నరసింహులు, ఆదిజినేష్, రామాంజినేయులు, నాగార్జున రెడ్డి,జె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జీపీఎస్ బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిరసన చేపట్టారు. ఈ మేరకు స్థానిక కాలేజ్ సర్కిల్ లో జీపీఎస్ బిల్లు జీవో ప్రతులను దగ్ధం చేసి అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా బుధవారం అసెంబ్లీలో జీపీఎస్ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భవిష్యత్తులో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం జోన్ యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, గోపాల్‌రెడ్డి, రాంప్రసాద్, సకలచంద్రశేఖర్, గడ్డంరామ్మోహన్, కావ్యకీర్తి విజయరాణి. నాగేంద్ర, నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి, శేషు, రమేశ్, చంద్రలు పాల్గొన్నారు.

మడకశిర : జిపిఎస్ ప్రతులను యుటిఎఫ్ నాయకులు దగ్ధం చేశారు. పట్టణము లోని వైఎస్ఆర్ సర్కిల్‌లో నిర్వహిచంఇన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కే. భూతన్న, సిపిఐ నాయకురాలు పవిత్ర, మండల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.ఎన్. మాలింగప్ప, .మూడ్లగిరియప్ప, వై. జోగప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : జిపిఎస్ కాదని ఒపిఎస్‌ను అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు డి శ్రీనివాసులు డిమాండ్ చేశారు .ఈ మేరకు జిపిఎస్ బిల్లును ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ , ఉపాధ్యాయులు సంక్షేమం గురించి ఆలోచించకుండా నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ , ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైవి సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఖాజా మోహిద్దీన్, జి ఆనంద్, రవివర్ధన్ రెడ్డి, వెంకటరమణ నాయక్ , నజీరుల్లా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతిపై అధికారులకు ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానని దండోరా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అకులప్ప, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగాద్రి చెప్పారు. పుట్టపర్తి మండలంలో ఉపాధి హామీలో ఎక్కించిన దొంగ బిల్లులను పీడీ రామాంజినేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అక్కులప్ప మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అధికారులు లెక్కలేనంత అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మండలంలోని సాతార్లపల్లికి చెందిన గోవిందమ్మ, తన కుమార్తె మోపూరి మంజుల బీసీలు అయితే సబ్సిడీ బిల్లుల కోసం అధికారులే ఎస్సీ రిజర్వేషన్ గా ఆన్లైన్‌లో ఎక్కించారన్నారు. దీనిపై పీడీ రామాంజనేయులుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అవినీతి సొమ్ముకు ఆశపడి ఎస్సీల నోటిపై దుమ్ము వేస్తున్న నాయకులు, అధికారులు ఇలాంటి మరెన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పుట్టపర్తి మండలం లోనే కాక ప్రతి మండలంలో పర్యటించిఉపాధి హామీ పనుల్లో ఎస్సీలకు జరిగిన అవినీతిని బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాతర్లపల్లికి చెందిన బాధితులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గొట్లూరు విద్యార్థులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఇటీవల అనంతపురంలో ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఎస్ జి ఎఫ్ ఐ స్కూల్ గేమ్స్ హాకీ జిల్లా జట్టులో ధర్మవరం మండలం గొట్లూరు గ్రామం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చోటు దక్కించుకున్నారు. జిల్లా హాకీ జట్టు అండర్-17 విభాగంలో లక్ష్మీ, రవితేజ, అండర్-14 విభాగంలో విజయ్ కుమార్, తేజశ్రీ, దుర్గ రెండు విభాగాలలో కలిపి ఆరుగురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, ఫిజికల్ డైరెక్టర్ రఘునాథరావు తెలిపారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా సెప్టెంబర్ 30వ తేదీ నుండి అక్టోబర్ 31వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బారన్‌సాబ్ తెలిపారు. 13 సచివాలయాల పరిధిలో రెండు టీములుగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రసాభాసగా మండలమీట్

ఓబుల దేవర చెరువు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎంపిపి పర్వీన్‌బాను అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో పాల్గొన్న పలువురు సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలో సమస్యలు విన్నవించినా అవి పరిష్కారం కావడం లేదని ఎంపీటీసీలు, సర్పంచులు విమర్శించారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు ఇక సమావేశాలెందుకు నిర్వహించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవితో పాటు పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ ఓబిరెడ్డి కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం గ్రామానికి వెళ్లి ఓబిరెడ్డిని పరామర్శించారు. ప్రమాద పరిస్థితులు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్ నారాయణ చౌదరి, గోనుగుంట్ల విజయ్ కుమార్ , రామ్మూర్తి నాయుడు, ఎల్ నరేంద్రచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి 'పల్లె' పరామర్శ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పలువురు బాధితులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బుధవారం పరామర్శించారు. మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో అనారోగ్యం తో బాధపడుతున్న తెలుగుదేశం సీనియర్ నాయకుడు, గోపాల మూర్తిని పరామర్శించారు. అదేవిధంగా పెద్ద కమ్మవారి పల్లి గ్రామంలో మాకినేని ప్రభాకర్ నాయుడు, మాకినేని లక్ష్మి కుమార్తె పవిత్రను అభినందించాడు. ఆమె ఇటీవల ట్రెజరీలో ఏటీవోగా ఎంపిక కావడం పట్ల ఆమెను అభినందించి సత్కరించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

గాండ్లపెంట : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపీడీవో రామనాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కురమామిడి సచివాలయ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి సిబ్బందికి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి ఓబులమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మెరిసిన బ్లూమూన్ విద్యార్థులు

కదిరి టౌన్ : భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నిర్వహించిన గురువందనం, కృష్ణాష్టమి వేడుకల్లో కదిరి బ్లూమూన్ విద్యార్థులు మెరిశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, సినీనటి రాగిణి పాల్గొన్నారు. కదిరి పట్టణంలోని బ్లూ మూన్ స్కూల్ విద్యార్థులు షరణి, నిషి, నిధి, రోషన్, యశ్వంత్ పాల్గొని నాటు నాటు అనే డాన్స్ చేసారు. వీరికి బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ శివశంకర్ సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేసి అభినందించారు.

నేడు కదిరిలో శాంతిర్యాలీ

కదిరి టౌన్ : మిలాదున్నబిని పురస్కరించుకొని 'మీలాద్ కమిటీ కదిరి వారి ఆధ్వర్యంలో జులూసే మహమ్మది (శాంతి ర్యాలీ)ని గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం

పెనుకొండ : పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు మాట్లాడుతూ పర్యాటక రంగం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. చారిత్రక ప్రదేశాలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనాఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ కె. ప్రతాప్, దేవిశెట్టి రామన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

హిందూపురం : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఐడియల్ యూత్ మూమెంట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐవైఎం టౌన్ ప్రెసిడెంట్ షఫీ వుల్లా, సున్నీ జామియా మజీద్ సెక్రెటరీ జనాబ్ సాదిక్, జమాతే ఇస్లామీ హింద్ టౌన్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, బాబు, మహబూబ్ బాషా, బాబాజాన్, దస్తగిరి, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి

మడకశిర : పంటసాగు చేసిన రైతులు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని రొళ్ల తహశీల్దార్ హసీనా సుల్తాన్ తెలిపారు. బుధవారం రొళ్ల మండలంలోనిరత్నగిరి, దొడ్డేరి పరిధిలోని గ్రామాలలో పంటల నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలించారు. ౦ ఈ కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ దివ్య జ్యోతి, వీఆర్వో ప్రకాష్ రైతులు పాల్గొన్నారు.

దళితుల భూములు వారికే ఇవ్వాలి

అన్యాక్రాంత భూముల్లో కెపిపిఎస్, సిపిఎం ఆధ్వర్యంలో జెండాలు పాతిన దళితులు

నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - లేపాక్షి

కుశలవ ప్రాజెక్టు కోసం అక్రమించుకున్న మండలంలోని కొండూరు , కొర్లకుంట గ్రామాలకు చెందిన దళితులు, బలహీన వర్గాలకు భూములను తిరిగి వారికే అప్పగించాలని సిపిఎం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అన్యాక్రాంత భూముల్లో సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితులు బుధవారం పార్టీ జెండాలు నాటారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కుశలవ ప్రాజెక్ట్ ప్రతినిధులు దళితులను టార్గెట్ చేశారన్నారు. వారి భూముల్లో పరిశ్రమలు పెట్టి ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మోస పూరిత మాటలు చెప్పి అక్రమంగా దౌర్జన్యంగా వందలాది ఎకరాలు భూమిని లాక్కొని వందలాది దళిత కుటుంబాలను నిరాశ్రయులను చేశారని విమర్శించారు. మోసం చేసిన కుశలవ ప్రాజెక్ట్ మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెండు సంవత్సరాలనుండి వివిధ రూపాల్లో విజ్ఞప్తులు , నిరసనలు చేసినా సంబంధిత రెవిన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. నిబంధనలు , చట్టాలను పాటించకుండా దళితుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మొత్తంగా అధికారులు, కుశలవ పెత్తందారులు కుమ్మక్కై దళితుల భూములు లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుశలవ ప్రాజెక్ట్ దళితుల భూములు మీద కోట్లాది రూపాయలు బ్యాంకు రుణాలు పొందిందని అన్నారు. తాము జెండాలు పాతిన ఈ భూముల్లో 4 రోజులు తరువాత విత్తనాలు వేసి సాగు చేస్తామని చెప్పారు. అధికారులు నిబంధనలు ప్రకారం దురాక్రమణ అయిన భూములు దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం , సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘటనాస్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులు, విఆర్ఒ శేషచలం సందర్శించారు. ఈ భూముల్లో ఎవరు పంట వేయరాదని చెప్పారు. రెవెన్యూ వారి పిర్యాదు మేరకు కుశలవ మేనేజ్‌మెంట్‌పై కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ , రాయుడు , మంజు , స్థానికులు గోపాలకృష్ణచ దళితులు నరసింహాప్ప , గంగాధర్ , మల్లిఖార్జున, రామలక్ష్మమ్మ , నాగమ్మ , ముద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ, లేపాక్షిలో సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -పెనుకొండ

జిల్లాలోని చారిత్రక నగరం పెనుకొండలో, శిల్పకళ కాణాచి లేపాక్షిలో ధ్వని, కాంతి (సౌండ్ అండ్ లైట్ షో) ప్రదర్శనను ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం కార్యాచరణను ప్రారంభించాలని ప్రముఖ చరిత్రకారుడు, పర్యాటక రంగ నిపుణుడు మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన పెనుకొండ కోటతో పాటు పలు చారిత్రక కట్టడాలను సందర్శించారు. ఈ సందర్భంగా విజయనగర సామ్రాజ్య చారిత్రిక కట్టడాల వైభవానికి నిదర్శనగా నిలిచిన గగన్ మహల్ ముందు నిలబడి విలేకరులతో మాట్లాడారు. పెనుకొండ, లేపాక్షి లలో సౌండ్ అండ్ లైట్ షో ప్రదర్శనను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల చారిత్రక వైభవానికి మరింత ప్రచారం లభిస్తుందని, అదేవిధంగా పర్యాటకుల తాకిడి మరింతగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పెనుకొండ, లేపాక్షి పరిసర ప్రాంతాల్లో లభించిన, లభిస్తున్న శిల్ప సంపదను భావి తరాలకు తెలియజెప్పడం కోసం జాతీయస్థాయిలో రెండు చోట్ల పురావస్తు ప్రదర్శనశాలలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. చారిత్రక ప్రదేశాల గొప్పదనాన్ని వివరిస్తూ లఘు చిత్రాలను నిర్మించి మ్యూజియంలో ప్రదర్శించాలని అదేవిధంగా మ్యూజియంలో భాగంగా ఒక ఆడిటోరియంను నిర్మించాలని ఆయన కోరారు.

గగన్‌మహల్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మైనాస్వామి

ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై వినతి

పుట్టపర్తి క్రైమ్ : ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక డీఈవోను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పని సర్దుబాటులో భాగంగా ఏ స్కూల్లోనూ ఉపాధ్యాయుల లోటు లేకుండా చూడాలన్నారు. అదనపు ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలల్లో వారి అభ్యర్థనను తీసుకొని బదిలీ చేయాలన్నారు. అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరగా పని సర్దుబాటు ముగించాలని ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా తీసుకొని అదనంగా చూపబడిన వారికి వారి ప్రాధాన్యత ప్రకారం సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌టీపీఎఫ్, పిఆర్‌టియు జిల్లా నాయకులు జీవీ రమణారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, నబీర్ సాహెబ్, పరంధామ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లేపాక్షికి టూరిజం అవార్డు రావడం అభినందనీయం

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

లేపాక్షికి టూరిజం అవార్డు రావటం అభినందనీయమని కలెక్టర్ అరుణ్ బాబు అన్నారు. జిల్లా పర్యాటక, సాంస్కృతిక, వ్యవహారాల శాఖా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2023 సందర్భంగా పుట్టపర్తి లోని సాయి ఆరాంలో ప్రపంచ పర్యాటక దినోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే పర్యాటక రంగాభివృద్ధి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు, పర్యటక రంగంలో విశేష కృషి చేసిన వివిధ వ్యక్తులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన లేపాక్షి గ్రామం 2023లో భారతదేశంలోని ఉత్తమ పర్యాటక గ్రామంలో ఒకటిగా సిల్వర్ కేటగిరీలో ఎంపిక కావటం రాష్ట్రానికి, జిల్లాకు గర్వకారణమన్నారు, జిల్లాలో అపారమైన పర్యటక ప్రాంతాలు ఉన్నాయని అన్నారు. వాటిని విద్యార్థులు సందర్శించాలని సూచించారు. అంతకుమునుపు పర్యాటక రంగం దినోత్సవ సందర్భంగా పుట్టపర్తి లోని సాయిరాం ఆసుపత్రి నుండి చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఓబుల్ పతి, పుడా చైర్మన్ లక్ష్మీ నరసమ్మ, ఆర్డీవో భాగ్యరేఖ, టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కులేదా.?

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలియచేసే హక్కులేదా అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని తన స్వగృహంలో సవితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ శాంతియుతంగా చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు అక్రమంగా దౌర్జన్యంగా భగ్నం చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతియుతంగా దీక్ష చేపడితే అరెస్టు చేయడం సమంజసమేనా అని ప్రశ్నించారు. పోలీసులు తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడదాకుల పల్లి మాజీ సర్పంచి ప్రసాద్, మాగే చెరువు సర్పంచి నరసింహులు, త్రివేంద్ర నాయుడు బాబుల్ రెడ్డి, నిసార్, సనావుల్లా, బాలాజీనాయక్, ప్రకాష్, వాసుదేవ రెడ్డి, సానిపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

జగన్ పాలనలో రాష్ట్రం రావణకాష్టం : టిడిపి

కదిరిలోని నిరసన దీక్షలో కందికుంట, తదితరులు

మడకశిర చెరువులో జలదీక్షలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, తదితరులు

ప్రజాశక్తి - పెనుకొండ

జగన్ పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో 15 వ రోజు సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చినప్పటి నుండి అరాచక పాలన సాగుతుందన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న నాయకులకు కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.ఈ రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు,జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ముఖ్యమంత్రి జగన్‌కు రాక్షస ఆనందం ఇక కొన్ని రోజులేనని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్ చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. సైకో ప్రభుత్వాన్ని ప్రశ్నించి...బాబుతో నేను అంటూ గొంతెత్తి చాటాలని ప్రజాచైతన్య కరపత్రాన్ని పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ కు నిరసనగా ముదిగుబ్బ తెలుగుదేశం పార్టీ నాయకులు ముదిగుబ్బ చెరువులో జల దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, నారాయణస్వామి, గడ్డం మోహన్, రియాజ్ బాషా, జయచంద్ర, ప్రతాప్, చంద్ర, అయూబ్ ఖాన్,చంద్ర, బాలాజీ, సాయి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడును విడుదల చేసేవరకు పోరాడుతామని టీడీపీ నాయకులు అన్నారు. చంద్రబాబు అక్రమఅరెస్టును వ్యతిరేకిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గరుగువెంగప్ప, సత్యనారాయణ ఆచారి, శ్రీనివాసులు, నాగరాజు, కుళ్లాయప్ప, షఫీ, రవి,తిరుపాలు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కందికుంట ఆధ్వర్యంలో కదిరి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 18వ రోజు కొనసాగాయి మేము సైతం బాబుతో అంటూ కదిరి నియోజకవర్గం రజక సంఘం ఆధ్వర్యంలో పాల్గొని బట్టలు ఉతుకుతూ తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ టిడిపికి మొదటినుంచి బీసీలు అండగా నిలుస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు, మోపురిశెట్టి చంద్రశేఖర, మాజీ సర్పంచులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తలుపుల మండలం కేంద్రంలో టిడిపి నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, కెసి. పండు, మస్తాన్‌వలి, షాకీర్, నారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో బాబు కోసం మేము కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. వీరు హేమావతి గ్రామం వరకు నిర్వహించిన పాదయాత్రలో ప్రజలు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్ మల్లికార్జున, మాజీ జెడ్పీటీసీ నరసింహామూర్తి, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, మాజీ సర్పంచి కుమార్ స్వామి, కేంకర నింగేగౌడ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు వినూత్న నిరసన తెలిపారు. చేతులకు సంకెళ్లు వేసుకుని వినూత్న రీతిలో టిడిపి శ్రేణులు నిరసన తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన నిరసన కార్యక్రమం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా చంద్రబాబును అరెస్టు చేశారని ఇలాంటి నీతిమాలిన చర్యలు వైసిపి ప్రభుత్వం మానుకోవాలని లేదంటేఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి దీక్షలకు సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు బచ్చల పుల్లయ్య, టిడిపి నాయకులు రత్నప్ప చౌదరి, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, బొమ్మయ్య, శ్రీరామ్ రెడ్డి, ఆరు మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడును వెంటనే విడుదల చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాలమేరకు పోస్టుకార్డుల ఉద్యమాన్ని మహిళలు బుధవారం చేపట్టారు. చంద్రబాబును విడుదల చేయాలని ప్రజల నుంచి పోస్టుకార్డుల ద్వారా సంతకాలు చేయించి వాటిని రాష్ట్రపతికి పంపుతున్నట్లు నాయకులు చెప్పారు.

మడకశిర రూరల్ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మడకశిర చెరువులో జల దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వక్కిలిగ కన్వీనర్ పాండురంగప్ప, టిడిపి నాయకులు రామకృష్ణ, నరేష్, శివ, రంగనాథ్ పాల్గొన్నారు.

హిందూపురం : చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ 15వ రోజు చేపట్టిన దీక్షల్లో బిసి నాయకులు పాల్గొన్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో బిసి నాయకులు ర్యాలీ చేపట్టి, మానవ హారంగా ఏర్పాడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెఇ వెంకట స్వామి, కొల్లకుంట అంజినప్ప, దుర్గా నవీన్, అమర్నాథ్, అంజినప్ప, నబి, చంద్ర శేఖర్ యాదవ్, రమేష్ కుమార్, బేవినహళ్లి ఆనంద్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవి (40) అనేమహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు... నంబుల పూల కుంట మండలం యాదాలవాండ్లపల్లికి చెందిన నరసింహులు, లక్ష్మీదేవి కొక్కంటి క్రాస్‌కు సొంత పని మీద వచ్చి తిరిగి తమ గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వేగంగా వచ్చిన ఐచర్ వాహనం వీరి వాహనాన్ని ఢీకొనడంతో లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గాండ్లపెంట : మండల పరిధిలోని గుడ్డి వెలగల పంచాయతీలోని నరసప్ప గారి పల్లికి చెందిన వేణుగోపాల్ (60) పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్ ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ వేణుగోపాల్ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. అప్పుల బాధ తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండల పరిధిలోని టేకులోడు గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుండి రెండు ద్విచక్రవాహనాలు, రూ. 5,910 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో 3 వ తరగతి చదువుతున్న అక్షయ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం స్కూల్ బస్సు విద్యార్థిని ఇంటికి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై వదిలింది. బస్సును దిగి ఇంటివైపు వెళుతున్న అక్షయ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన విద్యార్థి అక్షయ్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

సోమందేపల్లి : మండల పరిధిలోని నాగినేని చెరువు గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ సమీపంలో గల పొలాల్లో ఆవులు మేపుతుండగా అదే గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని నల్లగొండ రాయినిపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు.

గోరంట్ల పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి గోరంట్ల

స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పోలీస్టేషన్లో నమోదైన కేసుల పురోగతిని సిబ్బందితో ఆరా తీశారు కేసుల దర్యాప్తు విషయంలో సిబ్బంది బాగా పనిచేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చొరవ తీసుకొని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కియా పరిశ్రమకు వెళ్లే బస్సులు ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బరాయుడు సిబ్బంది పాల్గొన్నారు

చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గోరంట్ల రూరల్ : మండలంలోని పాలసముద్రం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మద్దిలేటి తెలిపారు, బెంగళూరు హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలో గల చెరువులో దాదాపు 35 ఏళ్ల వయసు గల వ్యక్తి బనీను, టీ షర్ట్, డ్రాయర్ తో చెరువులో పడి మృతి చెందాడని తెలిపారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సాయికృప కళాశాల విద్యార్థినులు

ధర్మవరం టౌన్ : అనంతపురం ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థినులు అండర్-19 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సాయికృపబాలికల జూనియర్ కళాశాల డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపల్ కొం డన్నలు తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులు ఆయేషా, మేజబి, జయశ్రీలు కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు పశ్చిమగోదావరి జిల్లాలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని చెప్పారు.. వీరిని పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు, తోటి విద్యార్థినులు అభినందించారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి

ధర్మవరం టౌన్ : పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, కమిషనర్ బండిశేషన్న కోరారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు ప్లాస్టిక్ నిషేధంపై స్థానిక అంజుమన్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీనగర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్వో ఆనంద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబాబాషా, శ్యామ్సన్, నాయకులు చాంద్‌బాషా, పెనుజూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : పట్టణంలోని కెనరా బ్యాంక్ ఎదురుగా నివాసం ఉంటున్న డా ఫజల్ ఇల్లు ఇటీవల కుర్షిన వర్షానికి కూలిపోయింది. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ బాధితులను పరామర్శించారు. తక్షణసాయంగా స్థానిక టిడిపి నాయకులు సిరి బాబయ్య చేతుల మీదుగా 20వేల రూపాయలను అందజేశారు.

ట్రాన్స్‌కో లైన్‌మెన్‌గా నరసింహ మూర్తి

రొళ్ల : మండలపరిధిలోని ఎం రాయపురం పంచాయతీ లైన్ మాన్‌గా నరసింహ మూర్తి బుధవారం విధుల్లోకి చేరారు. సోమందేపల్లి మండలంలో అసిస్టెంట్ లైన్‌మాన్‌గా పనిచేస్తున్న నరసింహమూర్తి ఉద్యోగోన్నతిపై ఎం రాయపురం పంచాయతీకి లైన్ మాన్‌గా వచ్చారు. మడకశిర ఎ డి కార్యాలయంలో ఎడి ప్రసాద్ రావ్‌కు ఉత్తర్వులు అందించి విధుల్లోకి చేరారు. అనంతరం జెడ్పీటీసీ అనంతరాజు ను కలిసి పూలమాల లు వేసి సన్మానించారు.

జెడ్పీటీసీని సన్మానిస్తున్న లైన్‌మెన్, తదితరులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మడకశిర : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని వైసిపి ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎం నరసింహులు తెలిపారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలంలోని వివిధ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలను ఆయన సందర్శించారు రొళ్ల ఎంపీపీ కవితా విజయ రంగయ్య గౌడ్‌ను కలిసి పలు సమస్యలను చర్చించారు. హెట్టే బెట్ట సర్పంచి ప్రకాష్, గుడ్డు గుడకి సర్పంచి హరికృష్ణ, ఎం రాయపురం సర్పంచి నరసింహులు కలిసి ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు చీపులేటి వెంకట రంగారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు